క్లుప్తంగా

నేటి నుంచి గ్రామసభలు

మద్దిపూడి: ఉపాధి హామీ పథకంలో జరిగిన పనులపై ఈ నెల 9 నుంచి 16వ తేదీ వరకు గ్రామసభలు నిర్వహించనున్నట్లు ఏపీఓ రాంబాబు తెలిపారు. 10న గుండ్లసముద్రం, తంగెళ్ల, అంకేపల్లి, 11న గార్లపేట, చిమట, 12న చిలంకూరు, కూచిపూడి, 13న వెంకటకృష్ణాపురం, కెల్లంపల్లి, కాకర్ల, 14న మద్దిపూడి, అయ్యపురాజుపాలెం, జువ్విగుంట, వేమవరం, 16న రామాయపాలెం, రేగలగడ్డ, నర్సరాజుపాలెం, వల్లాయపాలెం, రావిళ్లవారిపాలెం గ్రామాల్లో నిర్వహిస్తామని పేర్కొన్నారు.

కనులపండువగా పల్లకిసేవ


నారాయణస్వామి ఉత్సవమూర్తికి పల్లకిసేవ నిర్వహిస్తున్న భక్తులు

సీఎస్‌పురం(పామూరు): మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం మిట్టపాలెం నారాయణ స్వామి ఆలయ ప్రాంగణంలో స్వామి పంచలోహ ఉత్సవమూర్తికి పల్లకిసేవ కనులపండువగా వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపక చైర్మన్ కొమ్మినేని చిన ఆదినారాయణ, ఈఓ ఎస్‌జీఆర్.నరసింహబాబు, కొమ్మినేని వెంకట్రావు, భక్తులు పాల్గొన్నారు.

నారాయణస్వామి ఆదాయం రూ.లక్ష

సీఎస్‌పురం(పామూరు): మండలంలోని మిట్టపాలెం నారాయణస్వామి ఆలయానికి ఆదివారం రూ.1,00,340 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈఓ ఎస్‌జీఆర్. నరసింహబాబు సోమవారం తెలిపారు. స్వామి దర్శనం టిక్కెట్ల అమ్మకం ద్వారా రూ.41,600, లడ్డుప్రసాదాల అమ్మకం ద్వారా రూ.15,160, ఆలయం వద్ద నిర్వహిస్తున్న శాశ్వత అన్నదానం పథకం నిర్వహణకు విరాళాలుగా రూ.40,582, ఇతర విరాళాల కింద రూ.3 వేలు వచ్చినట్లు ఈఓ తెలిపారు. శాశ్వత అన్నదానానికి నెల్లూరు జిల్లా మర్రిపాడు మండలం ఖాదర్‌పూర్ గ్రామానికి చెందిన అన్నపురెడ్డి నారాయణరెడ్డి, సుగుణ దంపతులు, కుటుంబసభ్యులు బాలనాగిరెడ్డి రూ.13 వేల విరాళం అందజేశారన్నారు.

సీపీఎం మహాసభలను జయప్రదం చేయండి

సీఎస్‌పురం(పామూరు): చీమకుర్తిలో ఈ నెల 13 నుంచి 15వ తేదీ వరకు జరిగే సీపీఎం జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని పార్టీ మండల కార్యదర్శివర్గ సభ్యుడు ఊసా వెంకటేశ్వర్లు కోరారు. స్థానిక పార్టీ కార్యాలయంలో సోమవారం బక్కా జేసురత్నం అధ్యక్షతన జరిగిన పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలోని వెనుకబడిన ప్రాంతం అభివృద్ధి చెందాలంటే వెలిగొండ ప్రాజెక్ట్ వెంటనే పూర్తి చేయాలన్నారు. గత 15 ఏళ్లుగా తాగునీటి కోసం ప్రజలు అనేకపాట్లు పడుతున్నారని, శాశ్వత ప్రాతిపదికన తాగునీటి సమస్య పరిష్కరించాలన్నారు. పార్టీ మండల కార్యదర్శి ఊసా రాజ్యలక్ష్మి, సన్నపురెడ్డి తిరుపతిరెడ్డి, మారంరెడ్డి రత్నారెడ్డి, జి.జేసుదాసు పాల్గొన్నారు.

నేడు పంటల బీమాపై అవగాహన కార్యక్రమం

ఉలవపాడు: పంటల బీమాపై నేడు అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు ఉద్యానవన అధికారి జ్యోతి తెలిపారు. ఉదయం 10 గంటలకు ఉలవపాడు-2 రైతు సేవా కేంద్రంలో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. మండల పరిధిలోని మామిడి రైతులు ఉపయోగించుకోవాలని కోరారు.

ప్రజా సమస్యలపై పది అర్జీలు

కందుకూరు: స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజల నుంచి సమస్యలపై 10 అర్జీలు వచ్చినట్లు మున్సిపల్ కమిషనర్ కె.అనూష తెలిపారు. వీటిలో రేషన్‌కార్డు, పింఛన్లు, ఆధార్ సమస్యలు వంటి వ్యక్తిగత సమస్యలతో పాటు రోడ్లు, డ్రైనేజీలు, పారిశుధ్యం వంటి సమస్యలు ఉన్నట్లు తెలిపారు. ఫిర్యాదులను ఆయా విభాగాల వారీగా పంపి వీలైనంత త్వరగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలో సమస్యల పరిష్కారం కోసం 9177700267 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

ఘనంగా లక్ష్మయ్య వర్ధంతి

కందుకూరు రూరల్: రాష్ట్ర ఉపాధ్యాయ ఉద్యమ నిర్మాత చెన్నుపాటి లక్ష్మయ్య వర్ధంతిని కందుకూరులోని యూటీఎఫ్ కార్యాలయంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ప్రాంతీయ మండలాల అధ్యక్ష, కార్యదర్శులు, జిల్లా బాధ్యులు పాల్గొని లక్ష్మయ్యకు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షుడు కిలారి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ చెన్నుపాటి ఆశయ సాధనకు కృషి చేయాలన్నారు. ఉపాధ్యాయ సంక్షేమం, విద్యారంగ అభివృద్ధికి చెన్నుపాటి తన జీవితాన్ని త్యాగం చేశారన్నారు. చట్టబద్ధంగా ఈ రాష్ట్రంలో ఉపాధ్యాయ ఉద్యమం పురుడు పోసుకోవడానికి చెన్నుపాటి అనేక కష్టాలు పడ్డారని, చివరకు మద్రాస్ హైకోర్టు తీర్పు కారణంగా ఈ రాష్ట్రంలో ఉపాధ్యాయ ఉద్యమం ఏర్పడిందని తెలిపారు. అందుకే చెన్నుపాటిని ఈ రాష్ట్ర ఉపాధ్యాయ ఉద్యమ పితామహుడు అంటారని తెలిపారు. అనంతరం ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా గోపిమూర్తి విజయం సాధించిన సందర్భంగా స్వీట్లు పంచిపెట్టారు.

ఆగకుంటే అనర్థమే..!

- అల్పపీడనం ప్రభావంతో మళ్లీ వర్షాలతో రైతులు ఆందోళన
- కోత దశలో ఉన్న వరి, అలసంద
- మళ్లీ వర్షాలు కురిస్తే అన్ని పంటలకూ ఇబ్బందే


కోత దశలో ఉన్న వేరుశనగ సాగు

హనుమంతునిపాడు: బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. గత వారం మొత్తం వర్షాలు కురిశాయి. రెండు మూడు రోజులుగా వర్షాలు కాస్త తెరిపివ్వడంతో రైతులు కాస్త కుదుటపడ్డారు. కానీ అంతలోనే బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడి ఈ వారంలో వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ చెప్పడంతో రైతులకు కంటి మీద కునుకు కరువైంది. వాస్తవానికి తుఫాన్ ప్రభావంతో జిల్లాలో భారీ వర్షాలు కురిశాయి. చాలా ప్రాంతాల్లో పంటలు కోత దశలో ఉన్నాయి. దీంతో గత వారం కురిసిన భారీ వర్షాలకు రైతులు చాలా ఆందోళన చెందారు. అయితే రెండు మూడు రోజులుగా ఎండలు బాగా కాయడంతో నీరంతా ఇంకిపోవడంతో రైతులు కాస్త శాంతించారు. కొన్ని ప్రాంతాల్లో మినహా ఎక్కువ శాతం నష్టం వాటిల్లలేదు. అయితే ఇప్పుడు మళ్లీ వర్షాలు కురుస్తాయన్న చెప్పడంతో రైతులు ఏం చేయాలో తెలియక తల్లడిల్లుతున్నారు. ప్రస్తుతం వరి, మినుము, వేరుశనగ, అలసంద పంటలు కోతకొచ్చాయి. ఇప్పుడు వర్షాలు కురిస్తే ఈ పంటలకు ఎంతో నష్టం వాటిల్లుతుంది. ఇక పొగాకు తోటలు సైతం కొన్ని ప్రాంతాల్లో ఏపుగా పెరిగి ఉన్నాయి. ఇప్పుడు వర్షం కురిస్తే మడ్డి కారి పొగాకు నాణ్యత తగ్గే అవకాశం ఉంది. వర్షంవస్తే కోత దశకు వచ్చిన అలసంద, బొబ్బర్లు, వరి, వేరుశనగతో పాటు పొగాకు, మిరప, కంది పంటలు కూడా పూర్తిగా దెబ్బతినే అవకాశం ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సాధారణ కంటే ఎక్కువ విస్తీర్ణంలో..

నియోజకవర్గంలో ఈ ఏడాది సాగు విస్తీర్ణం పెరిగింది. అధికారుల లెక్కల ప్రకారం ఖరీఫ్ సాధారణ విస్తీర్ణం 54 వేల ఎకరాలు ఉండగా, రబీలో 45 వేల ఎకరాలు ఉంది. అయితే రబీలో 50 వేల ఎకరాల్లో పంటలు సాగు చేసినట్లు అధికారులు చెబుతున్నారు. ఈ ఏడాది వాతావరణం అనుకూలించడంతో సాగు విస్తీర్ణం పెరిగింది. దానికి తోడు గత ఏడాది పొగాకు ధరలు భారీగా రావడంతో ఈ ఏడాది పొగాకు అధిక మొత్తంలో సాగు చేస్తున్నారు. ఉద్యానవన పంటల సాధారణ విస్తీర్ణం 2,449 హెక్టార్లు కాగా 2 వేల హెక్టార్లు సాగు చేశారు. కనిగిరి డివిజన్‌లో కంది, వరి, పొగాకు, మిరప, వేరుశనగ, పప్పు శనగ, బొబ్బర్లు విస్తారంగా సాగు చేశారు. నియోజకవర్గంలో కంది 15,487 హెక్టార్లు, బోర్ల కింద వరి 500 హెక్టార్లు, పొగాకు 450 హెక్టార్లు, మినుము 750 హెక్టార్లు, అలసంద 3 వేల ఎకరాల్లో సాగు చేశారు. ప్రస్తుతం కొన్ని పంటలుకోత దశలో ఉన్నాయి. వర్షంకురిస్తే ఈ పంటలకు నష్టం వాటిల్లుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు.


ఏపుగా పెరిగిన పొగాకు


సాగులో ఉన్న అలసంద పంట


పూత పిందె దశలో కంది

రెవెన్యూ సమస్యలు పరిష్కరించుకోవాలి


పామూరులో మాట్లాడుతున్న తహసీల్దార్ రమణారావు


నాగులవరంలో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న దేవాదాయ శాఖ అధికారులు


సీతారాంపురంలో అర్జీలు అందజేస్తున్న రైతులు

పామూరు: ప్రజలు రెవెన్యూ సదస్సుల్లో సమస్యలను పరిష్కరించుకోవాలని తహసీల్దార్ బీవీ రమణారావు అన్నారు. మండలంలోని చిలంకూరులో సోమవారం రెవెన్యూ సదస్సు నిర్వహించి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా మ్యుటేషన్లకు సంబంధించి మొత్తం 7 అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో ఎన్‌డోమెంట్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, సర్పంచ్ మలినేని శ్రీనివాసులు, ఎంపీటీసీ పిడికిటి సుబ్బరత్తమ్మ, వీఆర్‌ఓ మస్తాన్‌వలి రెవెన్యూ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

సీఎస్‌పురం(పామూరు): భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ డి.మంజునాథరెడ్డి అన్నారు. మండలంలోని నాగులవరంలో సోమవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. తహసీల్దార్ ప్రజల నుంచి 8 అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో పరిశీలించి నిబంధనలకు అనుగుణంగా ఉన్న మ్యుటేషన్లను త్వరితగతిన పూర్తి చేస్తామని చెప్పారు.

హనుమంతునిపాడు: మండల పరిధిలోని సీతారాంపురంలో జరిగిన రెవెన్యూ సదస్సుకు మొత్తం 45 అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ దిలీప్‌కుమార్ తెలిపారు. భూమి ఆన్‌లైన్ చేయాలని 38 దరఖాస్తులు, అదనంగా ఎక్కిన భూమి తొలగించాలని 3, భూమి ఫ్రీహోల్డ్ కోసం ఒకటి, రేషన్‌కార్డుల కోసం ఒకటి, వ్యవసాయ భూమి కావాలని ఒకటి, భూమి సర్వే చేయాలని ఒకటి చొప్పున మొత్తం 45 అర్జీలు వచ్చినట్లు పేర్కొన్నారు. డీటీ కె.కిషోర్‌రెడ్డి, మండల సర్వేయర్ కాకర్ల రమణయ్య, వీఆర్వో షబీర్, కార్యదర్శి అశోక్, రెవెన్యూ సిబ్బంది షేక్ రసూల్ పాల్గొన్నారు.

టీడీపీ నాయకుని అకృత్యాలు అడ్డుకోండి

సింగరాయకొండ: మండలంలోని ఊళ్లపాలెం గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు పురిణి వెంకటేశ్వరరెడ్డి ప్రభుత్వం కేటాయించిన ఇళ్ల స్థలాలు ఆక్రమించుకున్నాడని గ్రామానికి చెందిన అంబేడ్కర్‌నగర్ కాలనీవాసులు తహశీల్దార్ టి.రవికి సోమవారం వినతిపత్రం అందజేశారు. మాజీ ఎంపీటీసీ బిళ్లా కోటేశ్వరరావు, గ్రామస్తులు మాట్లాడుతూ 1985లో ప్రభుత్వం ఎస్సీలకు ఇళ్ల స్థలాలు కేటాయించిందన్నారు. ఈ స్థలాల్లో కొంతభాగాన్ని పురిణి వెంకటేశ్వరరెడ్డి ఆక్రమించుకున్నాడని ఆరోపించారు. అంతేకాక మురుగుకాల్వల్లో మురుగు నీరు పారకుండా అడ్డుకట్ట వేశాడని, దీంతో మురుగునీరు పారడం లేదని, దోమల బెడద అధికంగా ఉండటంతో పాటు వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఇటీవల కాలనీ పక్కన స్థలంలో జామాయిల్ సాగు చేశాడని, దీంతో భూగర్భజలాలు అడుగంటి నీటి ఎద్దడి ఏర్పడే పరిస్థితి ఉందన్నారు. విచారించి కాలనీ పక్కన జామాయిల్ సాగు చేయకుండా అడ్డుకోవాలని, ఆక్రమించిన స్థలాన్ని విడిపించాలని, మురుగునీరు పారేలా చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో కోరారు. తహశీల్దార్ మాట్లాడుతూ విచారించి తగుచర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఊళ్లపాలెం అంబేద్కర్‌నగర్ కాలనీవాసులు

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

కనిగిరిరూరల్ (హనుమంతునిపాడు): మున్సిపల్ కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు సయ్యద్ యాసీన్ డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులకు గత ప్రభుత్వం అంగీకరించిన హామీలను అమలు చేసి కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికులను వెంటనే పర్మినెంట్ చేయాలన్నారు. ఇంజినీరింగ్ కార్మికులకు సంక్షేమ పథకాలు వర్తింప చేయాలన్నారు. కరోనా సమయంలో తీసుకున్న కార్మికులను అప్కాస్‌లో నమోదు చేసి వారికి జీతాలు చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు బాలిరెడ్డి, మున్సిపల్ అధ్యక్ష, కార్యదర్శులు కోటయ్య, అశోక్, నాయకులు కిరణ్, సుబ్రహ్మణ్యం, మస్తాన్, శేషయ్య, ఇమాం, హుస్సేన్, మస్తాన్‌వలి, ఏసుబాబు, ఖాశింపీరా, రత్తయ్య పాల్గొన్నారు.


కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్న కార్మికులు

మా పొట్ట కొట్టొద్దు

టంగుటూరు: ఎన్నో ఏళ్లుగా డివైడర్‌పై వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామని, ఇప్పుడు రోడ్డు విస్తరణ పేరుతో దుకాణాలు తొలగించాలని చూస్తున్నారని చిరు వ్యాపారులు సోమవారం ఎంపీడీఓ దేవసేన కుమారికి వినతిపత్రం అందించారు. కూరగాయలు, పండ్లు, తదితర చిన్న చిన్న వ్యాపారులు చేసుకుంటూ వచ్చిన రూపాయి పోగేసుకునే చిరు వ్యాపారస్తులనే చిన్న చూపుతో రోడ్డు విస్తరణ పేరుతో తొలగించాలని చూస్తున్నారని వాపోయారు. కానీ మండల టీడీపీ ముఖ్య నాయకుడిని చెందిన ప్రధాన కూడలిలో ఉన్న షాపింగ్ కాంప్లెక్స్ స్థలం ఏడు అడుగులు పంచాయతీ పరిధిలోకి వచ్చినా పట్టించుకోకుండా, చిరు వ్యాపారుల దుకాణాలను తొలగించడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు.


ఎంపీడీఓకి వినతిపత్రం అందజేస్తున్న చిరు వ్యాపారులు

20న మండల సమావేశం


పామూరు: మండల సర్వసభ్య సమావేశం ఈ నెల 20వ తేదీ శుక్రవారం ఉదయం 10.30 గంటలకు ఎంపీపీ గంగసాని లక్ష్మి అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ బొలినేని సురేష్ తెలిపారు. సమావేశానికి జెడ్పీటీసీ, వైస్ ఎంపీపీలు, కోఆప్షన్ సభ్యుడు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు హాజరుకావాలన్నారు. మండలంలోని అన్ని శాఖల అధికారులు పూర్తి సమాచారంతో సమావేశానికి హాజరు కావాలని కోరారు.

నేడు సోమరాజుపల్లిలో రెవెన్యూ సదస్సు

సింగరాయకొండ: మండలంలోని సోమరాజుపల్లి సచివాలయం వద్ద మంగళవారం రెవెన్యూ సదస్సు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ టి.రవి ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామసభలో రెవెన్యూ పరమైన సమస్యలు, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

జరుగుమల్లి(సింగరాయకొండ): మండలంలోని రామచంద్రాపురం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద మంగళవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు రెవెన్యూ గ్రామసభలు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ బి.జనార్దన్ తెలిపారు. గ్రామసభలో అన్ని రకాల రెవెన్యూ సమస్యలు పరిష్కరిస్తామని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

దళితుల భూములు కాపాడండి


తహసీల్దార్‌కు అర్జీ అందజేస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

పీసీపల్లి: దళితులకు ఇచ్చిన అసైన్‌మెంట్ భూములను కొంతమంది పెత్తందారులు చేతిలో ఉన్నాయని, తిరిగి వారికే ఇప్పించాలని చింతగంపల్లిలో జరిగిన రెవెన్యూ సదస్సులో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు బడుగు వెంకటేశ్వర్లు తహసీల్దార్ ఉషాకు అర్జీ అందజేశారు. చింతగు పల్లి, వేపగుంపల్లి, వెలుతుర్ల వారిపల్లి గ్రామాలకు చెంది దళితుల పట్టా భూములను స్థానిక పెత్తందారులు తమ రాజకీయ పలుకుబడుతూ దౌర్జన్యంగా పేదల భూములను అక్రమంగా కాజేయడానికి పెద్ద ఎత్తున ప్రయత్నం చేశారని, దళితులు వారి భూముల్లోకి పోకుండా వారిని అడ్డుకుంటూ దారులు లేకుండా చేస్తున్నారన్నారు. వెలుతుర్లవారిపల్లిలో సర్వే నంబర్ 148/1, 148/2 భిన్నాలకు చెందినటువంటి పట్టాదారులైన వేల్పుల తిరుపతయ్య, వేల్పుల వెంకటేశ్వర్లు, పల్లె ఓబులు , పల్లెకేశవులు, చిన్న రాముడు లకు చెందిన భూములను సుమారు 20 ఎకరాలు అసైన్మెంట్ భూమి ఆక్రమించారని, తిరిగి దళితులకు అప్పగించాలని వారు డిమాండ్ చేశారు. చింతకుంపల్లి సర్వే నంబర్ 1లో 800 ఎకరాలు ప్రభుత్వ భూములకు అక్రమంగా పొందిన పట్టాలను రద్దు చేసి, ప్రతి కుటుంబానికి మూడు ఎకరాలు వ్యవసాయ భూమిని భూమిలేని ప్రతి పేదవారికి పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. ఎంపీటీసీ భూమిరెడ్డి కొండారెడ్డి పాల్గొన్నారు.

క్షతగాత్రునికి దద్దాల ఆర్థికసాయం


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న దయానందంను పరామర్శిస్తున్న దద్దాల, ఇతర నేతలు

కనిగిరి రూరల్(హనుమంతునిపాడు): మండలంలోని బుడ్డారెడ్డిపల్లి గ్రామానికి చెందిన కుమ్మరికుంట దయానందం ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి కనిగిరిలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ కనిగిరి ఇన్‌చార్జి దద్దాల నారాయణ, జెడ్పీటీసీ కస్తూర్‌రెడ్డి, ఎంపీపీ దంతులూరి ప్రకాశం ఆస్పత్రికి వెళ్లి దయానందాన్ని పరామర్శించారు. వైద్యులతో మాట్లాడి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. ఆస్పత్రి ఖర్చుల నిమిత్తం రూ.20 వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు జి.ఆదినారాయణ, కటికల వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

దాతల సహకారం అభినందనీయం


కళాశాలకు నగదు అందజేస్తున్న దాతలు

మద్దిపూడి: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల అభివృద్ధికి దాతల సహకారం అభినందనీయమని కళాశాల ప్రిన్స్‌పాల్ అల్లూరయ్య అన్నారు. సోమవారం కళాశాలలో సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా కళాశాలలో వసతులపై దాతలు స్పందించారు. కళాశాలలో మరుగుదొడ్లు, కిటికీలు, తలుపులు మరమ్మతు గురైన విషయాన్ని అధ్యాపకులు దాతల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో కెల్లంపల్లి గ్రామానికి చెందిన అవదాని సుబ్బారావు మరమ్మతుల కోసం రూ. 20వేలు నగదును రేగుల వీరనారాయణ చేతుల మీదుగా అందజేశారు. అలాగే విశ్రాంత ఎంఈఓ ప్రసాదురెడ్డి స్పందించి కళాశాల అభివృద్ధికి రూ.10వేలు నగదును కళాశాల ప్రిన్స్‌పాల్ అల్లూరయ్యకు అందజేశారు. చేరెడ్డి నరసారెడ్డి, రేగుల వీరనారాయణ, అధ్యాపకులు ఉన్నారు.

సస్యరక్షణ చర్యలతో తెగుళ్ల నివారణ


చీర్లదిన్నెలో మిరప తోటలు పరిశీలిస్తున్న హెచ్ఓ అంజలిబాయి

కనిగిరిరూరల్(హనుమంతునిపాడు): మిరప రైతులు సస్యరక్షణ చర్యలు పాటిస్తే తెగుళ్లను నివారించవచ్చని కనిగిరి డివిజన్ ఉద్యానవన శాఖాధికారి ఎం అంజలిబాయి అన్నారు. మండల పరిధిలోని చీర్లదిన్నెలో రైతులు సాగు చేసిన మిరప పంటలను సోమవారం పరిశీలించారు. ఆకుముడత, కుచ్చుతెగుళ్లు, తామర పురుగు, తెల్లదోమ నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నివారణకు పిచికారీ చేయాల్సిన మందులపై సూచనలు, సలహాలు చేశారు. రబీలో మిరప సాగు చేసిన రైతులు ఎకరానికి రూ.525 ప్రీమియం చెల్లించాలని సూచించారు. కార్యక్రమంలో వీఏఏ హబీబ్, జిలానీ, రైతులు పాల్గొన్నారు.

సరస్వతి విగ్రహం ఏర్పాటుకు దాతల సహకారం


విగ్రహదాతను సన్మానిస్తున్న స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్, హెచ్ఎం

సీఎస్‌పురం(పామూరు): ప్రభుత్వ పాఠశాలలో సరస్వతి విగ్రహ ఏర్పాటుకు దాతల సాయం కొనియాడదగినదని స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్ షేక్.ఖాదరున్నీసాబేగం అన్నారు. మండలంలోని ముండ్లపాడు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు దాత సానా శివారెడ్డి తన సొంతనిధులతో సరస్వతి విగ్రహం సమకూర్చారు. ఈసందర్భంగా సోమవారం పాఠశాలలో హెచ్‌యం కే.చెన్నయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో విగ్రహదాత శివారెడ్డిని సన్మానించారు. కార్యక్రమంలో గజ్జల కోటిరెడ్డి, పాఠశాల చైర్మన్ నారాయణస్వామి, యం.వెంకటనారాయణ, మాలకొండారెడ్డి, లక్ష్మీనారాయణ, పొట్టేండ్ల మాలకొండయ్య, బొర్రాజు చిన్ననారాయణ విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రుణాలు సద్వినియోగం చేసుకోండి


కనిగిరి మున్సిపల్ కార్యాలయంలో చెక్ అందజేస్తున్న చైర్మన్ అబ్దుల్ గఫార్

కనిగిరిరూరల్(హనుమంతునిపాడు): స్వానిధి రుణాలు సద్వినియోగం చేసుకోవాలని కనిగిరి మున్సిపల్ చైర్మన్ షేక్ అబ్దుల్ గఫార్ అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పట్టణంలో వీధి వ్యాపారులు తమ వ్యాపారాలను అభివృద్ధి చేసుకోవాలన్నారు. అర్హులకు పీఎం స్వానిధి పథకాన్ని ప్రవేశపెట్టారన్నారు. ఈ పథకం ద్వారా అర్హులకు తొలుత రూ.10 వేల వరకు వడ్డీ లేని రుణాలు మంజూరు చేస్తామన్నారు. సకాలంలో చెల్లించిన వారికి రూ.20 వేల నుంచి రూ.50 వేల వరకు రుణం పొందే అవకాశం ఉందని తెలిపారు. మున్సిపల్ కమిషనర్ డానియేలు మాట్లాడుతూ బ్యాంకు నుంచి తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లించాలన్నారు. మెప్మా సీఎంఎం కె.రఘు, ఎస్‌బీఐ ఫీల్డ్ ఆఫీసర్ సురేష్, పట్టణ మహిళా సమాఖ్య కార్యదర్శి రాధమ్మ, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలి


హాస్టల్‌లో విద్యార్థులతో మాట్లాడుతున్న ఎస్సై కోటయ్య

పీసీపల్లి: విద్యార్థులు క్రమశిక్షణతో విద్యనభ్యసిస్తే ఉన్నత శిఖరాలకు చేరుకుంటారని ఎస్సై జి.కోటయ్య అన్నారు. స్థానిక గోపాలువారిపల్లిలోని సాంఘిక సంక్షేమ శాఖ హాస్టల్ విద్యార్థులతో ఎస్సై సోమవారం సమావేశమయ్యారు. అనంతరం వారికి ప్రభుత్వం నుంచి అందుతున్న పథకాలు, సౌకర్యాలను వివరించారు. భవిష్యత్‌లో భావిభారత పౌరులుగా ఎదగాలంటే క్రమశిక్షణతో ఎలా నడుచుకోవాలో వివరించారు. ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగితే అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవచ్చని సూచించారు.

మహారాజశ్రీ కావలి సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో
O.S.No: 407/2023
Between
దార్ల మాలకొండయ్య,
తండ్రి సుందర రామయ్య .....వాది
and
గుంటి మాలకొండయ్య,
తండ్రి నల్లయ్య@నరసింహం .....ప్రతివాది
To
గుంటి మాలకొండయ్య, తండ్రి నల్లయ్య @ నరసింహం, హరిజనపాలెం, ముప్పాళ్ల గ్రామం, పొన్నలూరు (మం.), ప్రకాశం జిల్లా.
అనువారికి ఈ నెంబరున మీపై వాది తన డబ్బులు వసూలు నిమిత్తం దావా దాఖలు చేసుకొని ఉన్నందున మీకు దావా నోటీసు నిమిత్తం తే.23-12-2024దీ కి వాయిదా వేయబడి ఉన్నది. కనుక ఆ దినమున ఉదయం 10.30 గంటలకు పై కోర్టులో హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకొనవలసినది లేని యెడల మీ పరోక్షమున ఎక్స్‌పార్టీగా తీర్మానించబడును.
G.Malyadri, B.Com, BL
Advocate, Kavali

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
కందుకూరు డివిజన్
90102 24456
Office mail : sakshiongads@gmail.com